# కాలము - పని

"హితశ్రీ"

"కాలం సాగిపోతోంది. పనులు జరిగిపోతున్నాయి. గుమాస్తాలు రాస్తున్నారు. రైతులు పొలం దున్నుతున్నారు, పంట పండిస్తున్నారు. శ్రామికులు చమట కారుస్తున్నారు. పెద్ద ఉద్యోగులు హుంకరిస్తున్నారు. ఫ్యాక్టరీల గొట్టాలు పొగవిడుస్తున్నాయి. మంత్రులు తిరుగుతున్నారు. నాయకులు అరుస్తున్నారు. విద్యార్థులు పుస్తకాలు రుబ్బుతున్నారు. పండిన ధాన్యం ఎక్కడో ఉడుకుతూనే ఉంది. ఇలా పనులు ఎప్పుడూ జరిగిపోతూనే ఉన్నాయి, కాలం గడుస్తోనే ఉంటుంది, కాలగమనం చూడకలిగినవాళ్లు చూస్తూనే ఉంటున్నారు; లేనివాళ్లు నిర్లక్ష్యంగా కళ్లు మూసుకుంటూనే ఉంటున్నారు. ఏదైతేనేం, ఏవిధంగానైతేనేం, మొత్తానికి ప్రపంచంలో పుట్టి పెరుగుతున్న ప్రతివాడూ ఏదో పని చేస్తూనే ఉన్నాడు. పగలు తరవాత చీకటి, చీకటి తరవాత పగలూ వస్తూనే ఉన్నాయి. ఈ క్రమం తప్పుతుందనే భయం కూడా లేదు. అలాగే మనిషికీ శ్రమా, విశ్రాంతీ వొస్తూ, పోతూనేఉన్నాయి. ఈ క్రమం కూడా తప్పుతుందనే భయం లేదు

కాలం సాగుతూనే ఉంటుంది. పనులు జరుగుతూనే ఉంటాయి. నిజమే. కాని పనులు జరగటం ఒక్కసారిగా ఆగిపోతే! ఏమవుతుంది? గుమాస్తాలు రాయరు. రైతులు పండించరు, శ్రామికులు చమట కార్చరు. గొట్టాలు పొగ విడవ్వు. మంత్రులు తిరగరు. నాయకులు అరవరు. విద్యార్థులు చదవరు. ధాన్యం ఉడకదు. మనుషులు బతకరు. కాలం ఇకముందు మనుషుల్ని చూడదు. అయితే ఈ పనులన్నీ మనుషులు బతకటానికి ఉపకరిస్తున్నాయి అన్న మాట! పని జరగనిదీ మనిషి బతకడు. నిజం. కాని ప్రతిపనీ మనిషిబతకటానికి జరగటం లేదు. ఆ పనులు నిష్ప్రయోజనాలు. మనిషి ఇంకా గొప్పగా బతకటానికి ఉపకరించే పనుల్ని కాలం దొంగిలిస్తోంది. ఆ పనులకి బదులు మనిషిని కిందికిలాగే కొన్ని పనుల్ని కాలం ఇప్పుడు మనకిస్తోంది!

కాలం వెనక్కి తిరగదు, చేసిన పనుల్ని చెరపలేం. ఇప్పుడు జరగాలిసిన పని- మానవ జీవిత ప్రమాణాన్ని కొన్ని మెట్లు పైకిలాగే ప్రయత్నం. ప్రపంచం మొత్తంమీద జరగాలిసిన పని ఇది ఒక్కటే. ఇది ఎలా సాధ్యమో చూద్దాం..."

"ప్రతి ఊళ్ళో మైకులూ, లౌడ్ స్పీకర్లూ పెడితే సరి."

జనసమూహంలోంచి ఏ మూలనించో వొచ్చిన ఈ మాటలకి, అంతవరకూ నిశ్శబ్దంగా ఉపన్యాసం వింటున్న జనం చిన్నగానవ్వారు. ఉపన్యాసకుడు మూర్తి ఆమాటలు వినవొచ్చిన దిక్కువైపు చూసి అన్నాడు.

"ఈ మాటలు అన్నవారెవరో దయచేసి లేచి నిలబడతారా ఒకసారి?"

కొద్దిసేపటి తరవాత జనం మధ్యలోంచి ఓ యువకుడు లేచి నుంచున్నాడు.

"మీరేనా అలా అన్నది?"

"అవును."

"అలా అంటంలో మీ అభిప్రాయం?"

ఒక క్షణం ఆలోచించి యువకుడన్నాడు:

"ఈకాలంలో పని జరగాలంటే మైకులూ, లౌడ్ స్పీకర్లూ లేకపోతే ఏమీ లాభంలేదు. సామాన్యుల గొంతులు వినపడవలసిన వాళ్ళకి వినబడవు. అంచేత, కావాలిసిన పనేమిటో మైక్ ముందు నిలబడి ఉచ్చరిస్తే అది వెంటనే తీగలద్వారా లౌడ్ స్పీకర్లకి బట్వాడా ఐ అక్కణ్ణించి గాలిలో పాకి, ఎవరికైతే వినబడాలో వాళ్ళ కర్ణపుటాలకి సోకుతుంది." జనం అంతా గొల్లుమన్నారు. మూర్తి మాత్రం నవ్వలేదు.

"మీ పేరేమిటి?"

"సుబ్బారావు."

మూర్తి ఉపన్యాసం సాగిస్తూ అన్నాడు:

"సుబ్బారావుగారు చెప్పినట్టు, సామాన్యుల గొంతులు ముఖ్యంగా ఎవరికి వినబడాలో వాళ్ళ చెవులకి పట్టిన చెవుడు వొదిలించటం ముఖ్యమే. అయితే అది మనం సాధించవలసిన పనికి ఒక ప్రయత్నం మాత్రమే. ఈ ప్రయత్నాలు బహుముఖంగా జరగాలి..."

"కాలం సాగిపోతోంది" అన్నారు ఎవరో.

"కాలం సాగిపోతూనే ఉంటుంది." అని మరొకరు జవాబిచ్చారు. జనం నెమ్మదిగా నవ్వారు.

"ఇప్పుడు కాలాన్ని గురించి మాట్లాడిన దెవరో నాకు చూడాలని ఉంది" అన్నాడు మూర్తి. ఇద్దరు యువకులు లేచి నిలబడ్డారు.

"దయచేసి మీ ఇద్దరూ ఇలా వొస్తారా? మీతో కొంచెంసేపు మాట్లాడాలి" అన్నాడు మూర్తి. ఆ ఇద్దరు యువకులూ నవ్వు ముఖాలతో మూర్తి దగ్గరకి వొచ్చారు. వాళ్ళలో ఒకరివైపు చూసి మూర్తి అన్నాడు:

"మీ పేరు?"

"శర్మ"

మూర్తి రెండో యువకుడివైపు ప్రశ్నార్థకంగా చూశాడు. అతను:

"రాజు" అన్నాడు.

"'కాలం సాగిపోతుంది' అనే విషయం ఇంతకి ముందు మీకెప్పుడైనా స్ఫురించిందా?"

"స్ఫురించకుండా ఉండటానికి అదేం కొత్త సంగతి కాదుగా!" అన్నాడు శర్మ. "భలే ప్రశ్నే!" అన్నట్టుగా నవ్వాడు రాజు.

"ఈ విషయం స్ఫురించగానే మీ భావాలు ఎలా ఉండేవో చెప్పగలరా?" శర్మకి సమాధానం దొరకలేదు. మూర్తి రాజువైపు చూశాడు.

"'నిన్న, ఇవాళ, రేపు - ఇదేగదా కాలం అంటే' అనిపించేది నాకు. ఒక్కొక్కప్పుడు కాలం మీద ఏదైనా కవిత్వం రాద్దామని ఉండేది. కాని సరైన భావాలు రాకపోవటం వల్ల రాయలేక పోయేవాణ్ణి" అన్నాడు రాజు.

"మీ కెన్నేళ్ళు?"

"ఇరవై - షుమారు" అన్నాడు రాజు.

"అంతే" అన్నాడు శర్మ.

"ఈ ఇరవైయేళ్ళ కాలంలో ఎన్నో పనులు చేసి ఉంటారు మీరు."

"అవును మరి" అన్నాడు శర్మ.

"ఈ ఇరవైయేళ్ళ కాలంలో మీరు చేసిన అతి ముఖ్యమైనపని ఒకటి చెప్పగలరా?"

శర్మ రాజువైపూ, రాజు శర్మవైపూ చూశారు. ఎవరికీ ఏ సమాధానమూ తోచలేదు.

"ఏదైనా సరే, ఒక్క చెప్పతగ్గపని మీరు గుండెమీద చెయ్యివేసుకుని 'ఫలానా ఘనకార్యం చేశాను' అని అనుకోగల ఒక్కపని చెప్పండి చాలు."

"అంత చెప్పుకోతగ్గ పనులేమీ చెయ్యలేదేమో. కాకపోతే పరీక్షలు ప్యాసు కావటం, ఆటల్లో గెలవటం - అన్నీ ఇలాంటివే ఏవో ఉంటాయి" అన్నాడు రాజు. శర్మ అదికూడా అనలేక పోయాడు.

"పోనీ, కనీసం ఏదైనా అలాంటి పని చెయ్యాలనుకున్నారా?"

"ఎందు కనుకోం!" అన్నాడు శర్మ కొంచెం కోపంగా.

"ఏమిటది?"

శర్మకి పచ్చి వెలక్కాయ నోట్లో పడ్డది. ఆలోచించాడు. కాని బుర్రకి ఏమీ తోచలేదు. రాజు పరిస్థితి అలాగే ఉంది.

"ఒక్క ప్రశ్న అడుగుతాను. తడుముకోకుండా సమాధానం చెప్పండి. మీ జీవిత లక్ష్యం ఏమిటి?"

ఏమిటి తమ జీవిత లక్ష్యాలు? రాజూ, శర్మా ఆలోచించారు.

"మీకు ప్రత్యేకించి ఏమీ లక్ష్యం లేదన్న మాట."

శర్మ, రాజూ సిగ్గుపడి తలలు వొంచుకున్నారు.

"ఇరవైయేళ్ళ కాలంలో ప్రపంచానికి పనికొచ్చే ఒక్క పనికూడా మీరు చెయ్యలేక పోయారు" మూర్తి వాళ్ళ భుజాలమీద చేతులు వేస్తూ అన్నాడు, "కాని, ఇక్కడ గణితం అనవసరం. జరిగిన ఇరవైయేళ్ళ కాలంలో మీరు ఏమీచేసి ఉండకపోవొచ్చు. వొచ్చే ఇరవైయేళ్ళ కాలంలో మీరు చాలా గొప్ప పనులు చెయ్యవచ్చు. కావలసిందల్లా చెయ్యా

అనే ఉత్సాహం, కోరిక ఉండటం, జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోటం, అంతే.”

కాసేపటిదాకా నిశ్శబ్దం ఆవరించింది. ఉన్నట్టుండి రాజు మూర్తిని ఒక ప్రశ్న అడిగాడు.

“మీ జీవితంలో చెప్పుకోతగ్గ పని ఏదైనా చేశారా?”

మూర్తి ప్రశాంతంగా నవ్వుతూ అన్నాడు.

“చేశాను.”

“ఎప్పుడు?”

“ఇప్పుడే.”

“ఏమిటది?” ఆశ్చర్యంగా అతనివైపు చూశారు రాజూ, శర్మా.

“మీతో మాట్లాడాను.”

రాజూ, శర్మా వింతగా మూర్తివైపు చూశారు.

“జీవితంలో గర్వించాలిసిన పని ఒకటి చేశానని నేననుకుంటున్నాను. అది కాలం రుజువు చేస్తుంది. మీ ఇద్దరూ, ఈజనం, నా ఆశని తమ చేతుల్లో పట్టుకున్నారు” అంటూ మూర్తి మళ్ళీ మైక్ దగ్గరికి వెళ్ళాడు.

“ఐహికంగా, నైతికంగా మానవ జీవిత ప్రమాణాన్ని కొన్ని రేట్లు పెంచే మహాకార్యానికి జరగాలిసిన బహుముఖ ప్రయత్నాల్ని గురించి మాట్లాడుకుంటున్నాం...”

“ఒక ప్రయత్నంగురించి ఇప్పుడే విన్నాం” అనుకున్నారు శర్మ, రాజూ.

# చెప్పనిది

బైరాగి

ఇది ముందే ఎందుకు చెప్పావు కావు?
ఇది మొదటే ఎందుకు చెప్పావు కావు?
తూరుపు క్రొంజిగురు కెంపు మాయకముందు
పగటిహంగుల అంగడులు తీయకముందు
వివిక్తవాంఛావీథుల యుద్ధవిరమణ వేళ[illegible]ందు
దూరపు తీరపు పిలుపు వినిపించే వీలున్నపుడు
మొదటే నీవు
ఎందుకు చెప్పావు కావు?
ఆశల ఇన్‌ఫ్లేషణ్ హృదయావేశపు రేషణ్
కోరికల, తీరికల, ధరల, జీతాల కంట్రోళ్లు
(ధర హెచ్చుట తగ్గుటకొరకు కాదిపా)
బెలూన్‌లో ఇంకా గాలిలేనపుడు
(బెజ్జం పొడవటం తప్పలేదిక వారి)
మొదటే నీవు
ఎందుకు చెప్పావు కావు?
అమాయకపు మొగంపై అనుభవపు మరకలు కాన రాకముందు
(కుమార సమీరంలో లేపచ్చికలు పసి పలుకులు)
వివేకపు రక్షణాలకు పార్శ్వభంగ ప్రమాణం లేకముందు
సత్తువలేని చేతులు వణకనప్పుడు